సంబరంగా సంక్రాంతి

సాక్షి నెట్‌వర్క్‌: ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాల్లోని అన్ని మండలాలు, గ్రామాల్లో ఆదివారం సంక్రాంతి సంబురాలు ఘనంగా కొనసాగాయి. ఈసందర్భంగా తెల్లవారుజాము నుంచే ప్రజలు తమ ఇంటి వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేశారు. ముగ్గుల్లో ధాన్యం, పండ్లు, గొబ్బెమ్మలను ఏర్పాటు చేశారు. వీధుల్లో గంగిరెద్దులు సందడి చేశాయి. చిన్నారులు, యువకులు గాలిపటాలను ఎగుర వేస్తు సందడి చేశారు. బోధన్‌లో ఎమ్మెల్యే షకీల్ గాలిపటం ఎగుర వేసి ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పలు గ్రామాల్లో పలు స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా కనుమ పండుగ..

సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం కనుమ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పశువులకు శుభ్రంగా స్నానం చేయించి పూజలు చేశారు. చందూర్‌లో స్థానిక రైతులతో బసవ రాజుల రైతు కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. సర్పంచ్ కర్లం సాయరెడ్డి హాజరై కమిటి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామం పాడి పంటలతో సుభీక్షంగా ఉండాలని ప్రార్థించారు.


రుద్రూర్‌లో మహిళలు ముగ్గులు వేస్తుండగా రంగులతో నింపుతున్న చిన్నారులు



ఆర్మూర్‌లో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు.. భీమ్‌గల్‌లో..


చిక్కడపల్లిలో..


నీలా గ్రామంలో..


నందిగామ గ్రామంలో..


బోధన్‌లో ముగ్గులు వేస్తున్న చిన్నారులు




బోధన్‌లో గాలిపటం ఎగుర వేస్తున్న ఎమ్మెల్యే షకీల్.. అంతాపూర్‌లో గాలిపటాలు పంపిణీ చేస్తున్న యూత్ సభ్యులు.. చందూర్‌లో బసవన్నల పండుగ

క్లుప్తంగా

బిల్లా బాగులుకు ఘన నివాళి



నందిపేట్(ఆర్మూర్): ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు బిల్లా బాగులుకు యూనియన్ నాయకులు ఘన నివాళులు అర్పించారు. మండలకేంద్రంలో సోమవారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో బాగులు ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు గంగాధర్, రాజలింగం, సాయినాథ్, సమీ, సయ్యద్, మల్లేష్, సమద్, లత తదితరులు పాల్గొన్నారు.

బోధన్: పట్టణంలోని నాయి బ్రాహ్మణ కాలనీలో సోమవారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా సబ్ డివిజన్ కమిటీల ఆధ్వర్యంలో కార్మిక నాయకుడు బాగుల ప్రథమ సంస్మరణ సభను నిర్వహించారు. పీవోడబ్ల్యూ పట్టణ అధ్యక్షురాలు నాగమణి, ప్రజా సంఘాల నాయకులు సీతారాం ,చందు , కీర్తన, నిఖిత, కార్మికులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



మాక్లూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చిత్రపటానికి కమ్మ సంఘ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కమ్మ సంఘం భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి రూ. 25 లక్షలు మంజూరు చేశారన్నారు. హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ వేములపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశామన్నారు. బీఆర్ఎస్ నాయకులు గోపు రంజిత్, డీలర్ శ్రీను, పాల మురళి, శివరామ కృష్ణ పాల్గొన్నారు.

విజిలెన్స్ ఎస్పీకి సన్మానం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాజరాంనగర్‌కు చెందిన బండి గంగాధర్ తమిళనాడు విజిలెన్స్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నాడు. సంక్రాంతి సందర్భంగా బండి గంగాధర్ సొంతూరికి రావడంతో సోమవారం ఆయనను తన నివాసంలో ఆర్మూర్ మున్నూర్‌కాపు పటేల్ సంఘం సభ్యులు కలిసి, సన్మానించారు. ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్ రావు, ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు బండిగంగాధర్‌ను మార్యాదపూర్వకంగా కలిశారు.

ఆలయానికి కుర్చీల వితరణ

రుద్రూర్: మండలంలోని సులేమాన్ నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బసవేశ్వర స్వామి ఆలయానికి సోమవారం నిజామాబాద్‌కు చెందిన నరేష్ 26 కుర్చీలు అందజేశారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం కుర్చీలు అందజేసినట్లు దాత పేర్కొన్నారు.

కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభం

నవీపేట: మండల కేంద్రంలో సోమవారం ఓ కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని నిజామాబాద్ నార్త్‌జోన్ సీఐ నరహరి ప్రారంభించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాంకిషన్‌రావ్, బీడీ దాస్, సాయిబాబాగౌడ్, బాగారెడ్డి, నర్సింగ్‌రావ్, అబ్బన్న, తెడ్డు పోశెట్టి, లోకం నర్సయ్య, రాజేంద్రకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో సోమవారం వెవా జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. బీఆర్ఎస్ నాయకులు పండిత్ పవన్, కౌన్సిలర్ కాశీరాం, వెవా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్, జిల్లా ప్రధానకార్యదర్శి రాజారాం, డివిజన్ అధ్యక్షుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

మాయావతి జన్మదిన వేడుకలు



రుద్రూర్: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి 67వ జన్మదిన వేడుకలను పార్టీ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. నాయకులు నీరడి ఈశ్వర్, హరిప్రసాద్, శ్యామ్, శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


సాలూరలో క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే షకీల్

బోధన్‌రూరల్(బోధన్): క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసాన్ని పెంపొందించుకోవచ్చని బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అన్నారు. మండలంలోని సాలూర గ్రామంలో సోమవారం సొసైటీ చైర్మన్ అల్లె జనార్థన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. క్రికెట్ ఆడి టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడలపై సైతం దృష్టి సారించాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర

కోటగిరి: పోతంగల్ మండలంలోని హంగర్గా గ్రామ శివారులోని మంజీరా నది వద్ద వెలసిన గంగమ్మ తల్లి గుడివద్ద సోమవారం జాతర ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆటపాటలతో కోలాటాలు ఆడి సంబరాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.


గుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు


అన్నదానంలో పాల్గొన్న భక్తులు

కొనసాగుతున్న రిలే దీక్షలు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం కొనసాగాయి. దీక్షలో న్యాయవాదులు శంకర్, అర్జున్ రాండర్, గుమస్తాల సంఘ సభ్యులు కూర్చున్నారు. విద్యార్థి జేఏసీ సంఘం ప్రతినిధి శివకుమార్, న్యాయవాదులు కులకర్ణి దత్తాత్రిరావు పాల్గొన్నారు.

డొంకేశ్వర్‌కు బస్సు నడిపించాలి

నందిపేట్(ఆర్మూర్): ఆర్మూర్ నుంచి డొంకేశ్వర్ మండల కేంద్రానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్ కోరారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఆర్మూర్ నుంచి వన్నెల్ కే గ్రామం మీదుగా మారంపల్లి, గంగాసముందర్ గ్రామాలను కలుపుతూ డొంకేశ్వర్ మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్న ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి సురేందర్, అన్నారం సంజీవ్, ఎంపీటీసీ చిన్నరెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కోటగిరి: మండలంలోని కొత్తపల్లిలో సోమవారం పలు బాధిత కుటుంబాలకు ఇటీవల మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ భారతి అశోక్ రెడ్డి పంపిణీ చేశారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కోటగిరి సుదర్శన్, ఉపాధ్యక్షుడు రేణి సాయులు, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అశోక్ రెడ్డి, అప్పిరెడ్డి, రాజన్న, బాలయ్య పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని లాలన వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు పైపుల రాజారెడ్డి స్పష్టం చేశారు. మండలకేంద్రంలోని పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి మాట్లాడారు. పాఠశాలలో అవసరమైన వసతుల కల్పనకు తనవంతు సహకారం అందజేస్తానని తెలిపారు. సర్పంచ్ జక్కం చంద్రకళ బాల్‌కిషన్, డాక్టర్ సుభాష్(ఈఎన్‌టీ స్పెషలిస్ట్), ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీటీసీలు గడ్డం గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు తీర్మానం

ఇందల్వాయి: మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద పలు అభివృద్ధి పనులకు గ్రామాల్లో జీపీ పాలకవర్గాలు తీర్మానం చేసినట్లు ఎంపీడీవో రాములు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు రూ.1.95 కోట్ల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లు, రూ.80 లక్షలతో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు సంబంధించిన నివేదికను అనుమతుల కోసం ఉన్నతాధికారులకు పంపినట్లు ఆయన తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత

డిచ్‌పల్లి: మండలంలోని రాంపూర్ గ్రామంలో ఓ బాధిత కుటుంబానికి రూ.1.50 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని సోమవారం సర్పంచ్ పాపాయి తిరుపతి, ఎంపీటీసీ పోతర్ల సుజాత రవి అందజేశారు. వీడీసీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ రమేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏఐకేఎంఎస్ సమావేశం

డిచ్‌పల్లి: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోటగల్లి ఎన్‌టీఆర్ భవన్‌లో మంగళవారం అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నిజామాబాద్ జిల్లా జనరల్ కౌన్సిలింగ్ సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి సాయాగౌడ్ తెలిపారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 11 గంటలకు జిల్లా జనరల్ కౌన్సిలింగ్ ప్రారంభమవుతుందన్నారు. గత ఉద్యమ సమీక్ష, భవిష్యత్ ఉద్యమ కార్యచరణ అంశాలపై చర్చిస్తామని తెలిపారు. అలాగే అఖిల భారత రైతుకూలీ సంఘం రెండు సంఘాలుగా విడిపోయి 'తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ సంఘం, తెలంగాణ ప్రగతిశీల కూలీసంఘంగా ఏర్పడుతాయన్నారు. రైతులు, రైతు కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు వాసరి మోహన్, గంటా రాజేందర్, రాందాస్, పోశయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని ఓ బాధిత కుటుంబానికి సోమవారం నిజామాబాద్‌లోని శ్రీలక్ష్మీచేయూత సంస్థ తరపున రూ.15.000 ఆర్థిక సహాయం అందజేశారు. సంస్థ అధ్యక్షుడు వంగల రమణాచారి, లక్ష్మణ్, భూషణ్ , పూర్ణ చందర్,గురుచరణ్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రేపు ప్రారంభం కానున్న కంటివెలుగు

- బోధన్ డివిజన్‌లో 184 సెంటర్లు

బోధన్‌టౌన్(బోధన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం బుధవారం ప్రారంభం కానుంది. 100 రోజుల పాటు కార్యక్రమం నిర్వహించేలా ఇప్పటికే అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈసందర్భంగా బోధన్ డివిజన్‌లోని బోధన్, ఎడపల్లి, రెంజల్, కోటగిరి, రుద్రూర్, వర్ని, మోస్రా, చందూర్‌తో పాటు నూనతంగా ఏర్పాటైన పోతంగల్, సాలూర మండలాల్లో 184 సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లతో 18 టీంలు పనిచేయనున్నాయి. ఒక్కో టీంలో 8 మంది ఉండగా డివిజన్‌లో ఏర్పాటు చేసిన సెంటర్లతో 144 మంది విధులు నిర్వహించనున్నారు. ఒక్కో టీంలో మెడికల్ ఆఫీసర్, కంటి వైద్యులు, డాట ఎంట్రీ ఆపరేటర్, ఏఎన్ఎంలు 2, ఆశ వర్కర్లు 3 పనిచేయనున్నారు. ప్రతీ సెంటర్‌లో రోజుకు 265 మందికి పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు కంటి వెలుగు సెంటర్ నిర్వహిస్తారు. వారంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు సెంటర్‌ను నిర్వహిస్తారు. డివిజన్ వ్యాప్తంగా 18 సంవత్సరాల వయస్సు పైబడిన వారు 2లక్షల 75 వేల 657 మంది చికిత్స పొందేలా అధికారులు జాబితాను సిద్ధం చేశారు.

కంటివెలుగును విజయవంతం చేయాలి


నందిపేటలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు
- నందిపేటలో మండల సమావేశం

నందిపేట్(ఆర్మూర్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. నందిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాకిడీ సంతోష్‌రెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్ పాల్గొని మాట్లాడుతూ.. గ్రామాలలో ఏర్పాటు చేసిన క్యాంపులలో అవసరమైన సదుపాయాలను కల్పించాలని ఆరోగ్య శాఖ సిబ్బంది, సర్పంచులు, ప్రజాప్రతినిధులను ఆదేశించారు.

అంతకు ముందు జిల్లా మత్స్యశాఖ అధికారి రాజనర్సయ్య మాట్లాడుతుండగా ప్రజాప్రతినిధులు కల్పించుకుని చెరువులో చేప పిల్లలు వదిలే సమయంలో తమకు సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులో ప్రమాదవశాత్తు మత్స్య కారులు చనిపోతే పరిహారం ఇప్పించడంలో అధికారులు సహకరించడం లేదన్నారు. ఈ నందిపేట, డొంకేశ్వర్ మండలాల తహసీల్దార్‌లు అనిల్‌కుమార్, రవీందర్‌లు ఎంపీడీఓ నాగవర్ధన్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



ఆర్మూర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు.. సాలూరలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిబ్బంది

- ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత
- కంటివెలుగు కేంద్రాల పరిశీలన

ఆర్మూర్‌టౌన్: కంటి సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్లక్ష్యం చేయద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాలను సోమవారం ఆమె వైద్యధికారులతో కలిసి సందర్శించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ మనోహర్, డీఈ భూమేష్, వైద్యధికారులున్నారు.

బోధన్ పట్టణంలో..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాలను సోమవారం అధికారులు పరిశీలించారు. పట్టణంలోని 1, 14, 18, 20, 37 వార్డులో ఏర్పాటు చేసిన కేంద్రాలను అధికారులు పరిశీలించి వసతుల ఏర్పాటును అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ హైమద్ మాట్లాడుతూ..ఈ నెల 18న కంటి వెలుగు కార్యక్రమం 5సెంటర్లలో ప్రారంభం కానుందని తెలిపారు. ఏఈ శ్రీనివాస్, వైద్యురాలు అంజలి జాంకార్ ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని సాలూరలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమం కరపత్రాలను ఎంపీడీవో మధుకర్, సాలూర సర్పంచ్ చంద్రకళ ఆవిష్కరించారు. ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


బోధన్‌లో కంటి వెలుగు సెంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సిద్ధులగుట్టపై ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై గల శివాలయం, రామాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, కౌన్సిలర్‌లు రమేష్, రవిగౌడ్‌లు కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ నిర్వహించారు.

సమాచారం..

దరఖాస్తులు అందజేయాలి

ఆర్మూర్‌టౌన్: మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న పత్రాలను ఈనెల 18లోపు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే మైనార్టీ కార్పొరేషన్‌లో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న ఫాంలో ఎటువంటి మార్పులు చేసుకోవాలనుకునే వారు. బుధవారం లోపు దరఖాస్తు ప్రతాలను మున్సిపల్‌లో అందించాలని తెలిపారు.

నేడు వర్ని మండలంలో స్పీకర్ పర్యటన

వర్ని: మండలంలో మంగళవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పర్యటించనున్నట్లు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్లాల్ గిరి ఒక ప్రకటనలో వెల్లడించారు. మండలంలోని పొట్టిగుట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించడంతోపాటు పలు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్పీకర్ ప్రారంభిస్తారని ఆయన వెల్లడించారు.